యుగారంభం

పన్నెండు గ్రామాల చిన్న సంస్థానం నారగిల్లు. అందులో ఒక ఊరు మాది. సంస్థానం చిన్నదైతే పాళ్యమనీ, దాని పరిపాలకుణ్ణి పాళేగాడనీ వ్యవహరించడం రివాజు. సన్నిధానంలోనైతే 'దొరవారూ' అని సంభావించడం మర్యాద. రాజ్యం చిన్నదైనా, హోదా పరిమితమైనా దొరవార్ల పేర్లు మాత్రం పెద్దవే! మా పాళేగారి పేరేమిటో తెలుసా? నారగంటి వీర ప్రతాప ముద్దు నారసింహ నాయనివారు. అంగుళం వెడల్పుతో సరిగంచు వచ్చిన నారాయణవనం పంచతో, పొట్టి చొక్కాపైన మోకాళ్లదాకా వ్రేలాడే వెండి బొత్తాముల కోటుతో, గిరజాల జుత్తుతో, పొట్టు తీసేసిన కందగడ్డలాంటి ముఖంతో ఆయన చారిత్రిక యుగాల నాటి నగర కొత్వాలులా ఉండేవాడు. ముందూ వెనుకా పదిమంది దాకా బరాబరులు పలుకుతుండగా, ఆయన అప్పుడప్పుడూ దివాణం గుర్రంపైన గ్రామ సంచారానికి వేంచేయడం చూడదగ్గ వేడుక. దొరవారొస్తున్నారంటే ఆరోజు ఊరికంతా పండగే! మేళతాళాలతో, పంబల వాద్యాలతో, పిల్లంగోవి చిందులతో ఎదురేగి వెళ్ళి, ఎడనీటితో పానకాలతో దాహశాంతిచేసి, రచ్చగట్టుపైన చల్లటి నీడలో మంచాలు వేయించి, చలువ పందిరిలో మంచినీటి కడవలు, నీరు మజ్జిగ దుత్తలు పెట్టించి, మధ్యాహ్నం భోజనానికి యేటలు రోయించి, నసాళానికంటేటట్టుగా మసాలా పోపులు పెట్టించి గ్రామస్తులు దొరవారిని అతిథ్య సత్కారాల్లో ముంచి లేవనెత్తారు.

అప్పటికప్పుడు నులకమంచంపైన తయారైన తాత్కాలిక తక్తుపైన కూర్చున్నాక వివాదాలు వచ్చినవాళ్లు, తగాదాలు పడిన వాళ్లు దొరవారి ఎదుటికొచ్చి మూగిపోయేవారు. కేసుల పరిష్కారంతో పొద్దు నడిమింటి కొచ్చేది. భోజనానంతరం గ్రామ చావడిలో విశ్రాంతి. ప్రొద్దు వాటారినప్పటినుంచీ చావడి ముందున్న ఆవరణ పోటీలతో, పందాలతో ఉరకలెత్తే ఉత్సాహ సముద్రమైపోయేది. గుండ్లు పైకెత్తడాలు, పరుగెత్తే ఎద్దుల బండిని చేతితో ఒడిసిపట్టి లాగి నిలబెట్టడాలు, మోచేతితో కొబ్బరికాయను చిత్తుచిత్తుగా కొట్టడాలు- ఇలాంటి పోటీల్లో గెలిచిన వాళ్ళకి బహుమతులు ఇచ్చేశాక, దొరవారు పరివారంతో కలిసి పెట్రోమాక్స్ లైట్ల వెలుతుర్లో రాత్రి భోజనానికి కూర్చునేవారు. కట్టలు కట్టలుగా తమలపాకుల, పట్టెడు పట్టెడం వక్కలు పళ్లెరాల్లో వచ్చేసేవి. పాళెగారితోబాటు గ్రామ పెద్దలుకూడా తాంబూల చర్వణానికి ఉపక్రమించేవారు.

భుక్తాయాసానికీ, రాత్రి విరామానికీ మధ్య రసవత్తరమైన సన్నివేశం ఒకటి రూపు దిద్దుకుంటూ ఉండేది.

పెండ్లికొడుకును వెన్నంటి ఉండే తోడుపెండ్లికొడుకులా దొరవారి నెల్లప్పుడూ అనుసరించే వ్యక్తి ఒకతనుండేవాడు. భుజం పైన్నుంచీ జందెం. లేత సొరపిందెలాంటి జుత్తు. చేతికి బంగారు కంకణం, చెవులకు అంటు పోగులు. కట్టుకున్న పంచపైన భుజాలు పైన్నుంచీ వ్రేలాడే శాలువా తప్పితే మరే అచ్ఛాదనమూ ఉండేదిగాదు. బక్కపలచటి మనిషి. దొరవారి గ్రామ సంచారపు మజిలీలో చివరిఘట్టం ఎప్పుడూ ఆయన మూలంగానే రక్తి కడుతూ ఉండేది.

రాత్రి తొలి జామున తాంబూల సేవనం చేస్తూ కూర్చున్న పాళేగారు – 'ఏరి? ఎక్కడ అయ్యావారు?' అని పరామర్శించేసరికి, ఆయన తెరలోపలినుంచీ రంగంపైకి

వచ్చే పాత్రలా, దొరవారి ఎదుటకు వచ్చి సిరిచాప పైన కూర్చునేవాడు. 'వస్తిరా అయ్యగారూ! ఒక మంచి మాట చెవిలో వెయ్యండి' అనేవారు పాళేగారు. సిద్ధంగా ఉన్నట్టు ముఖ భంగిమద్వారా వ్యక్తంచేసే వారేగానీ, అంతకుమించి అయ్యగారు పెదవైనా కదిపేవాడు కాదు. అప్పుడిక దొరవారే ఛాయిస్ తీసుకోవలసి వచ్చేది. 'నీరాట వనాట ములకు పోరాటం బెట్లు కలిగే? అదేంది? గజేంద్రమోక్షమా! ఆ కథ చెప్పండి' అనో, 'కట్టుకున్న పట్టాన్ని పావురాలెత్తుకపోయిన కథ... నలోపాఖ్యానం గదూ! అది చెబ్తారా?' అనో, 'ఆహా. మహానుభావుడు కదండీ భర్తృహరి! ఎంత బాగా చెప్పినాడు. 'కాల మహిమ? కొంచెం అందుకుంటారా" అనో - ఇలా పాళెగారు ఏదో ఒక అంశాన్ని తానే సూచించేవారు. వినే ఆయనలో పెల్లుబికిన ఆసక్తిని బట్టి, చెప్పే ఆయనలో భావావేశం పరవళ్లు దొక్కేది. కర్పూరపు పెళ్లల్లాగా, కలకండ ముక్కల్లాగా, రువ్విన పువ్వుల్లాగా ఆయన గొంతుకలోనుంచీ మాటలు ఊడిపడేవి.

'అది మహాదుర్గం. దుర్గంలో రాచనగరం. అందులో నిండు పేరోలగం, అల్లదిగో వారే భటులు, నటులు, గాయకులు, వందిమాగధ విదూషకులు. అదంతా గడచిన గాథ. ఇప్పుడక్కడ కనిపించేది మొండి గోడలు. తిరిగేవి గుంట నక్కలు. పెరిగేవి ముండ్ల మొక్కలు. ఇదంతా కాలం చేసిన జాలం, ఆ కాల మహిమను మనం గమనిస్తున్నామా? కాలాన్ని ఫలవంతం చేసుకుంటున్నామా? లేదే! విద్యలు నేర్చి వినుతికెక్కింది లేదు. ధైర్యంతో సాహసకార్యాల జోలికి వెళ్లింది లేదు. దానధర్మాలు చేసింది లేదు. ఇలాంటి బ్రతుకు బ్రతికి ఏం సార్థకం? చీకటింట్లో పెట్టిన దీపాలలాంటి వాళ్లం. మాతృ యౌవనమనే వనాన్ని విచ్ఛేదం చేయడానికి ఏర్పడిన గొడ్డళ్ళలాంటి వాళ్లం. కాలమనే మహాప్రవాహం గట్టున నిల్చున్న చెట్టలాంటివాళ్లం. ప్రవాహం గట్లను కోసేసిన కొద్దీ వేర్లు తెగిన తరువులు ఆ ప్రవాహంలోనే పడి కొట్టుకపోయినట్టుగా మనం చివరకు కాలగర్భంలో కలిసిపోతాం...' అని విషయాన్ని పూర్తిగా పునశ్చరణ చేసిగానీ వదిలి పెట్టేవాడు కాదు అయ్యగారు. 'ఆహా, ఆహా! ఒక్కొక్క పలుకూ వరహా చేసేదిగదండీ! చూస్తిరా, నా ఒళ్లెట్లా రోమాంచమై పోయిందో"నని దొరవారు కోటు చేతులపైకి తీసి, చేతులు ముందుకు సాచేవారు.

నాకప్పటి కింకా పదేళ్లయినా నిండలేదు. పై చదువులకోసం పట్నం వెళ్లాక పాళెగాళ్లందరూ సాధారణంగా మద్యపానలోలురై, మదోన్మత్తులై, ప్రజాకంటకులై ఉంటారని వింటూ వచ్చాను. మరైతే మా నారగింటి పాళేగారి తీరు మాత్రం అందుకు భిన్నంగా గోచరిస్తూ ఉండేది. ఏమైనా చదువుల్లో పడిపోవడంవల్ల నేను తదితర విషయాలను గురించి అట్టే ఆలోచించలేదు. ఈలోగా పది పన్నెండేళ్లు గడిచిపోయాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. జాతీయ ప్రభుత్వం గీచిన ఒక్క గీతతో పెద్ద పెద్ద సంస్థానాలే రద్దయిపోయాయి. పెద్ద రాజ్యాలకే దిక్కులేకపోతే, ఇక నారగింటి పాళ్యం అడ్రస్ ఎక్కడ? జీవనభృతి క్రింద గవర్మెంటువారు పాళేగారికి ఎంతోకొంత నష్టపరిహారం ఇస్తున్నారేమో! చాప చిరిగి చిరిగి చదరంత అయిందేమో! ఏమిటో మరి. అందును గురించి స్పష్టంగా నాకేమీ తెలియదు. పట్టించుకోనూ లేదు.

ఎం.ఏ. పరీక్ష రాసి వచ్చి, ఇంటిదగ్గర కాలక్షేపం చేస్తూ వచ్చిన కొత్తలో, ఒకరోజు నాకు నాయని వారి దగ్గరనుంచి పిలుపువచ్చింది. నాతో ఆయనకే పని పడి ఉంటుందో తెలియక ఆశ్చర్యపడిపోయాను. అయినా పెద్దమనిషి పిలవనంపాక వెళ్లాలిగదా! మా

ఊరికి, నారగింటికీ రెండు మైళ్ల దూరం. ఆపాటి దూరం నడచివెళ్లడం ఒక లెక్కలోని పనికాదు. అయితే పిలవనంపిన కారణమేమిటో తెలియక జంకుగొంకులతోనే బయల్దేరి వెళ్లాను. తీరా వెళ్లాక తెలిసింది. నా హోదా పెరిగిపోయినట్టు నాయనివారే సెలవిచ్చారు. నారగింటి పాళ్యం ఏరియాలో మొట్టమొదట ఎంయే పరీక్షకు కూర్చున్న వాణ్ణి నేనేనట! అందులోనూ అభిమాన పాఠ్యాంశంగా తెలుగు తీసుకున్నానని తెలిశాక ఆయన ఆనంద పరవశుడైపోయాడు.

"చదువుల్లోకంతా పెద్ద చదువుకదంటయ్యా ఎమ్మే అంటే! అందులో తెలుగంటే మాటలా! మహాభారతం పజ్జెనిమిది పర్వాలూ చదివే ఉంటావు. భాగవతంలో అన్ని స్కంధాలు నోటికొచ్చే ఉంటాయి. రామాయణాల్లో మేలైనదేదో గ్రహించే ఉంటావు. మాదేముంది? చదివే వాళ్లు చదవగా, అర్థ వివరణ చేసేవాళ్లు చేయగా, అర్థమైనంత అర్థం కాగా, జ్ఞాపకం ఉన్నంతవరకూ జ్ఞాపకముండగా, మరిచిపోయినంత మేరకు మరిచిపోగా మిగిలిందేకదంటయ్యా మా సాహిత్య కోశం! నీ సంగతట్లా కాదే! నీ మాదిరిగా ఒక చదువరి మా పాయకట్టులో ఉన్నాడంటే అది మాకెంతో గొప్ప కదా! నువ్వు తరచుగా మా దగ్గరికొచ్చి పోతూ ఉండాల" అని ఆప్యాయంగా సమాదరణ చేశాడు.

మేమిద్దరమేగాక అప్పుడా హజారంలో మాతోబాటుగా మరో వ్యక్తి ఒకత నుండిపోయాడు. ఎముకల పటువు, కండరాల బిగువు. కుచ్చుగా ప్రారంభమై సూదుల్లా కొనదేలిన మీసాల సోయగం – ఈ హంగుల్ని బట్టి నేనతనొక వస్తాదై వుంటాడనుకున్నాను. నాయని వారు నా ఇంగితాన్ని కనిపెట్టి సందేహనివృత్తి చేయడానికి పూనుకున్నారు. "జవ్వాది రంగభట్టునే ఎరుగువా గోపాలం! మా కొలువులో కవిపీఠం ఈ కుటుంబీకులదే! వీళ్ళ తాతగారి పేరు మాధవభట్టు, నువ్వూ చూచే ఉండొచ్చు. గ్రామ సంచారాలల్లో నన్ను వెన్నంటి ఉండేవాడు. కంచుకంఠం మాధవభట్టు అని ప్రఖ్యాతి. పద్యం చదివినాడంటే ఫర్లాంగు దూరం వినిపించాల్సిందే! రాత్రి భోజనాలైన తర్వాత ఆయన వచ్చి నాలుగ్గడియలపాటు పురాణ ప్రవచనం చేసి వెళ్తేగానీ మా నాయనగారికి నిద్రపట్టేదిగాదు. భారతంలో ఆది పంచకం, పోతన్నగారి భాగవతం, గోన బుద్ధారెడ్డి రంగనాథ రామాయణం, కంకంటి పాపరాజు ఉత్తర రామాయణం మా పారాయణ గ్రంథాలు. పోతే వీళ్ల తండ్రి లక్ష్మణభట్టున్నూ, నేనున్నూ ఒకే ఈడు వాళ్లం. ప్రాచీన గ్రంథాలన్నీ క్షుణ్ణంగా చదువుకున్నాడేగానీ అతడి కెందుకో పురాణాల కన్నా ప్రబంధాలంటేనే ఇష్టం. పాపం, తండ్రి బ్రతికుండగానే ఆ కాలంలో పోయినాడు. తాతగారికి వృద్ధాప్యం దాపురించడం వల్లనైతేనేమి, తండ్రి అర్థాంతరంగా ఇహలోక యాత్ర ముగించడం వల్లనైతేనేమి, రంగభట్టు చదువుపైన శ్రద్ధ పెట్టే వాళ్లు లేకపోయారు. అయినా ఇంగువ కట్టిన గుడ్డ కదా! వాసన పోతుందా! మనవాడు ఎక్కడెక్కడ వెదికి పైకి తీసినాడో గాని, టుమ్రి పుస్తకాలు కొన్ని పట్టేసినాడు. శేషం వేంకటపతి శశాంక విజయమంటే ఇతనికి ప్రాణంతో సమానం. ముద్దుపళని రాధికా సాంత్వనమంటే వల్లమాలినంత ఇష్టం. కూచిమంచి జగ్గకవి చంద్రరేఖా విలాపమంటే సరేసరి! వాచోవిధేయం!"

మాధవభట్టు నుంచి ప్రారంభించి రంగభట్టు దగ్గరికి వచ్చేసరికి నా పని మలయకూటం నుంచీ బయల్దేరి థార్ ఎడారిలోకి వచ్చి పడిపోయినట్టయింది. అందుకు తగ్గట్టు అప్పటికి నేనేదో శత్రు శిబిరానికి చెందినవాడినైనట్టు, అతడు అనుమానంగా నావైపు చూడడంకూడా నాక్కొంచెం ఇబ్బందిగానే ఉండిపోయింది.

నేను జాగ్రత్తగా వాకబు చేసి తెలుసుకున్నాను. చిన్నవో, చితకవో - రంగభట్టు కావ్యాలేవీ రాసినట్టు లేదు. పట్టుమని పది పద్యాలైనా రాసి ఉంటాడా- అని నా అనుమానం. లేదంటే చాటువులు, సమస్యాపూరణాలు, దత్తపదులు కొన్ని సంగ్రహించుకొచ్చి (అవి తానే రాసినట్టు మభ్యపెడుతూ) దొరవారిని అలరించేవాడు. చాలని దానికి ఏ పండుగో, పబ్బమో వచ్చినప్పుడు సామాగ్రితోపాటు సంభావనగూడా స్వీకరిస్తూ ఆశువుగా తోపించేటట్టు పాళేగారిపైన కొన్ని పద్యాలు గుప్పించేవారు.

మాటలోన, మంచి మనసులో, నిండైన
గుండెలోన , మేటి గుణములందు
ఎవరు నీకు సాటి ఈ వసుంధరయందు
నారగింటి ముద్దు నారసింహ!
ఎముకలేని చేయి, ఎద మెత్తనైనది
తిరుగులేని మాట, దీన జనుల
కొంగు పసిడి వగుచు కొలువు దీరితి వయ్యా
నారగింటి ముద్దు నారసింహా!
కలిమి యన్న నీది, బలిమియన్నను నీది
చెలిమి నీది, గొప్ప తెలివి నీది
తేజరిల్లినావు దినరాజు చందాన
నారగింటి ముద్దు నారసింహ!"

పొగడ్తంటే ఎవరికైనా ఇష్టమే గదా! పద్యాలు విన్నంతసేపూ విని, ఆ తర్వాత నాయనివారు "నాయనా గోపాలం! ఎట్లా ఉంది రంగభట్టు కవిత్వం?" అంటూ ప్రశ్నించి, నన్ను ఇరకాటంలో పెట్టేసేవారు.

ఉన్నమాట చెబితే నిష్ఠూరం, లేనిమాట చెప్పడం ఆత్మవంచన. అక్షరాస్యుడైనవాడు ఓపిక పట్టి వెయ్యి పద్యాలు చదివేస్తే ఎన్నో కొన్ని రెడీమేడ్ పద బంధాలు బుర్రలో ప్రవేశించి తిష్ఠ వేసుకుంటాయి. అవసరాన్ని బట్టి అవి టకీమని స్ఫురణకు వస్తూ పాద పూరణలోకి పొందికగా ఒదిగిపోతూ పద్యాన్ని రేవుకు చేరుస్తాయి. ఈ కూసు విద్యవల్ల కవులుగా చలామణీ అయినవారు ఎందరులేరు! అది సరే! ఈ మాట నాయనివారికి నేనెలా చెప్పగలను? అందుకని ఈ ఒక్క విషయంలో మాత్రం మూగనోము పట్టేశాను.

అయినా నా మౌన సాధన అలా ఎంతోకాలం కొనసాగడానికి వీల్లేకపోయింది. ఆఖరుకు మొగమాటం వదిలిపెట్టి కవిత్వం పట్ల నా అభిప్రాయమేమిటో తేల్చి చెప్పక తప్పింది గాదు.

"మహాకవులు పద్యాన్ని తమ చెప్పుచేతల్లో నడిపించారు. తాము ప్రకటించ దలచుకున్న భావాన్ని అక్షరాలా పద్యంలో పలికించారు. అయితే మధ్య యుగాల నాటికి తలిశెట్టి రామారావుగారి కార్టూన్‌లో ప్రబంధ సుందరిలా, పద్యం పదాడంబరంతో బరువెక్కి పోయింది. మళ్లీ కొన్ని వందల యేండ్లు గడిచేసరికి పద్యాల చరిత్రలో మరింత పిదపకాలం వచ్చేసింది. ప్రేయసీ ప్రియుల్ని వాళ్లు పడకటింటికి వెళ్లిపోయినా వదిలిపెట్టకుండా కవులు వెంబడిస్తూ వచ్చారు. కాలక్రమాన ఈ స్థితి మరింతగా దిగజారి చిత్రకవిత్వమంటూ ఒకటి రాజ్యం చేయసాగింది. ఏడాక్షర కవితలు, రెండక్షరాల కవితలు, ఖడ్గబంధాలు,

గోమూత్రికా బంధాలు- ఇంకా ఇలాంటి గజకర్ణ, గోకర్ణ, టక్కుటమారా విద్యలెన్నో బలిసిపోయాయి. చూస్తూ చూస్తూ ఉండగానే ఆ గారడీ విద్యలుకూడా అడుగంటి, గురువును లఘువుగా కుదించి, లఘువును గురువుగా లాగి, గణభంగం జరగకుండా కఠోర సాధనచేసి, ప్రాసలకోసం ప్రయాసపడి, యతులకోసం మతులు పోగొట్టుకుని ఎట్లాగైనా పద్యాలల్లాలన్న కక్కుర్తి ప్రబలిపోయింది. చిత్రింపదలచుకున్న అందమైన అమ్మాయి, చిత్రణ పూర్తయ్యేసరికి మీసాలతో గడ్డాలతో తయారైనట్టు, చెప్పదలచుకున్న భావానికి, చెప్పిన విషయానికి దూరం పెరిగిపోతున్నప్పుడు ఛందస్సును పట్టుకుని ఎందుకు వ్రేలాడాలి? శుభ్రంగా రసాత్మకమైన వాక్యాలతోనే పబ్బం గడుపుకోవచ్చుగదా! కవితా విన్యాసంలో కొంత లయ ఉంటే చాలు. వచనంలోనైనా కవిత రాయొచ్చునంటున్నారు ఆధునికులు, కొందరు రాసి మెప్పిస్తున్నారు కూడా!" అని విన్నవించుకున్నాను.

"ఎవరి సంగతో మనకొద్దు, నువ్వు రాయగలవా?" అని నిలదీసి అడిగారు నాయనివారు.

అప్పటికి నేనేమీ బదులు చెప్పలేదు. ఎప్పటికీ చెప్పకపోయినా బాగుండేది. కానీ ఉబలాటం ఉండనిస్తుందా? నా కవితలు కొన్ని అచ్చయిన కాలేజీ మేగజైన్లు, అముద్రిత కవితలు నిద్రపోతున్న రెండు నోట్ పుస్తకాలు పట్టుకెళ్లి దొరవారికి నివేదించుకున్నాను.

ఆయన త్రిప్పినంతసేపూ పుటలు త్రిప్పి చూచి, ఆ తరువాత తల పంకిస్తూ "అప్పుడే నేననుకొంటిని లేవయ్యా! రాయగలిగిన ముఖం మాదిరే ఉంది నీది. మంచిది. నువ్వొక పని చెయ్.రాత్రి కిక్కణ్నే భోజనం చేసి పడుకో. తెల్లవారు జామున ఒక పనుంది" అన్నారు. ఏం పనబ్బా అది! ఆ రాత్రి నాకు సరిగ్గా నిద్రపట్టలేదు.

నా ఒక్కడితోనేగాదు. రంగభట్టుతోగూడా పనిబడినట్టుంది నాయని వారికి. మరునాటి ప్రాతఃకాలం ఆరుగంటలకల్లా ఆయన మమ్మల్నిద్దర్నీ ఊరి ముందర చెరువు దగ్గరకు తీసుకెళ్లారు.

అర్ధచంద్రాకారంగా ఒక మైలు దూరం పొడవున్న చెరువు కట్ట. కట్టను ఒరుసుకుంటూ దబకలాడుతున్న స్వచ్ఛమైన నీరు. జలాశయానికి తూరుపు సరిహద్దుగా పచ్చటి కొండలు, జలతారు పోగుల్లా జాల్వారుతున్న మంచుసోనల్లోనుంచీ అప్పుడప్పుడే కొండపైకి వస్తున్న సూర్యబింబం. సూర్యకిరణాల ప్రసారంవల్ల చెరువు నీటితో మిలమిలలాడుతూ ఏర్పడిన వెలుగుబాట. కట్ట పొడుగునా నిలబడిన పాతకాలపు తరువుల్లో లేయెండ వెలుగులు పడి తళతళా మెరిసిపోతున్న రావి ఆకులు...

ఆ దృశ్యాన్ని మేము కవితలో నిబంధించాలట!

దొరవారి ఆదేశం!!

"సాయంకాలందాకా గడువిస్తున్నా. మీరు రాసిందేదో నా చేతిలో పెట్టి వెళ్లండి" అంటూ ఆయన మెట్లు దిగి దివాణం వైపు వెళ్ళిపోయారు.

రంగభట్టుగూడా మీసాలు పురి తిప్పుకుంటూ ఎంతో గుంభనంగా ఆయన్ను వెంబడించారు. నేను మాత్రం చెట్టు బోదెకానుకుని చెరువు కట్టపైనే కూలబడిపోయాను.

రోటిలో తలదూర్చాక రోకటి పోటుకు వెరచి లాభమేముంది? కవిత రాయడం వేరు. ఆ పని పైన పోటీకి తలపడడం వేరు. మొదటి దానిలో ఒత్తిడి ఉండదు. అందీ అందనట్టుండే భావం అందుబాటులోకి వచ్చేదాకా వేచి ఉండొచ్చు. కొంతకాలం గడచిన

తర్వాత మళ్లీ ఒకసారి చదివిచూచి, అవసరమైన చేర్పులూ మార్పులూ చెయ్యొచ్చు. పోటీలో ఇదంతా కుదరదు గదా! పందెమన్నాక పరుగెత్తాల్సిందే! ముందూ వెనకా చూచుకోడానికి వీలుండదు.

నేను అలా కూర్చుని ఉండగానే జాము పొద్దెక్కింది. కడుపులో పేగులు నకనక లాడుతున్నాయి. నీరసంతో కనురెప్పలు బరువెక్కి వాలిపోయాయి. కళ్ళు తెరుచుకున్నప్పుడు ఎట్టఎదుట కనిపించిన దృశ్యం కళ్లు మూతలు పడేసరికి అంతరంగంలోకి వచ్చి నిలిచిపోతోంది. చెదిరిపోకుండా ఆ దృశ్యాన్ని మనసులో చిక్కబట్టుకున్నాను. ఎప్పుడో ఏ క్షణాన్నో బుర్రలో ఓ మెరుపు మెరిసింది.

"మంచు వలిపం కట్టుకున్న ప్రకృతి సుందరి
తన నుదట పెట్టుకున్న కుంకుమ బొట్టులా
తూరుపు కొండ రొమ్ముపైన
సూర్యబింబం మెరిసిపోతోంది..."

అరరే. ఒక భావం స్ఫురించిందే! ఇలాగే మరికొన్నింటిని పదాల్లోకి పొదగడమే గదా కవిత్వమంటే! ప్రయత్నించి చూద్దామన్న పట్టుదల నాలో పీఠం వేసింది.

"ఎంత చూచినా తనివితీరని అందాలు
స్వచ్ఛమైన చెరువు నీటి అద్దంలో
మరీ మరీ చూచుకుంటూ
సృష్టి కాంత మురిసిపోతోంది
విశ్వసౌధంలో జరగబోయే
శుభకార్యాన్ని వీక్షించే నిమిత్తం
దివినుండి దిగి వచ్చే సుర వనితలకోసం
చెరువు కడ్డంగా వేసిన వెలుగుబాట
వెండి తివాచీలా కన్నులపండువగా ఉంది.
చల్లగా మెలమెల్లగా వీచే మలయ సమీరంలో
రెపరెపలాడిపోతూ,
బాలభానుడి బంగారు కాంతుల్లో
మిలమిల లాడిపోయే ఆకులతో
రావిచెట్లు పల్లెపైకి వింజామరలు వీస్తున్నాయి.
భావించి చూచేవాళ్లకీ
ప్రశాంత ప్రభాతవేళ
కన్నతల్లి ఒడిలా హాయిగా ఉంది
మధురగానం విన్నంత ఆనందంగా ఉంది
భగవంతుడి సాక్షాత్కారంలా అద్భుతంగా ఉంది..."

మెట్లు మెట్లుగా భావాలను పేర్చుకుంటూ వెళ్లే ప్రయత్నం ఇట్లాగే కొనసాగింది. చివరకు మనసేదో అనిర్వచనీయ రసానందంలో లయించినట్టు ఒక మధురానుభూతితో తనువు పులకించింది.

మడిచిన కాగితాలను నాయని వారికి చేర్పించి, నేను చక్కా మా ఊరికి వెళ్లిపోయాను.

అప్పటికెట్లాగో పరీక్ష అయితే రాశానుగానీ, ఫలితాల పట్ల నాకట్టే నమ్మకం లేదు. రెండు మూడు రోజులదాకా నారగింటివైపు తిరిగి మళ్లీ చూడకుండా మా ఊళ్లోనే ఉండిపోయాను. నాలుగోరోజు నాయనివారి దగ్గరినుంచి పిలుపు రానే వచ్చింది. బెదురు మనసుతోనే బయల్దేరి వెళ్లాను. దివాణం ముంగిట సైకిలు నేర్చుకుంటున్న నాయని వారి మనవడు 'రండి, రండి, తాతగారు పూజగదిలో ఉన్నారు. వస్తే మిమ్మల్ని కూచోమన్నారు' అన్నాడు.

గడపలో ద్వారబంధానికటూ, ఇటూ పెద్ద అరుగులున్నాయి. కుడివైపు అరుగుపైన కూచుంటూ, అపరిచిత వ్యక్తి ఎవరో ఎడమవైపు అరుగుపైన కూర్చుని ఉన్నట్టు గమనించాను. పేరు పెట్టి నన్ను పలకరించిన తర్వాతగానీ పోల్చుకోలేకపోయాను. ఎవరోకాదు... రంగభట్టే! పోల్చుకోలేకపోయినందుకు కారణం - మూతిపైన మీసాలు లేకపోవడమే! మీసాలుండిన లోటు బరాబయలుగా ఉంది.

"ఏమిటండీ భట్టుగారూ! ఎందుకిలా చేశారు!" అని ప్రశ్నించాను.

"పోటీలో ఓడిపోయినాను గదయ్యా! నాయనివారికి నా పద్యాలు నచ్చలేదు. నీ కవిత్వం నచ్చింది. అందుకనే మీసాలు తీసేశాను" అన్నాడు బుంగముఖం పెడుతూ రంగభట్టు.

లోపలికి వెళ్ళి నాయనివారితో భేటీ కాగానే, నా అంతర్యాన్ని నివేదించుకున్నాను- "అయ్యా, ఇది చాలా అన్యాయం. తమరలా సెలవిచ్చి ఉండకూడదు. రంగభట్టు ముఖం చూస్తుంటే ఏడుపొస్తుంది" అన్నాను.

వడగాలిలో కదిలిన ప్లాస్టిక్కు పువ్వులా నాయనివారి పెదవులపైన ఓ శుష్కహాసం మెదిలింది. "అయ్యో, ఇందులో నేను చెప్పింది ఏముంది నాయనా! తన పద్యాలు వీగిపోవడంతో తనంతట తానే తీసేసినాడు. అయినా మీసాలకేముంది? కొద్ది రోజుల్లోనే వచ్చేస్తాయి. ఆ మాటకొస్తే నా రాజ్యం పోయినా నేనేం చింతించలేదే! పొయ్యేవి పోకా మానవు. వచ్చేవి రాకా మానవు. దివాణంలో ఒక నగారా ఉండేది తెలుసునా నీకు? కొడితే దాని మోత మీ ఊరిదాకా గూడా వినిపిస్తుండేది. మూడు నెలలప్పుడు అది నెర్రెలు పడిపోతే ఎత్తుకపోయి మూలగదిలో పారేయమన్నాను. నగారా మాటకేముంది గానీ, దివాణానికి మిగిలిన ఆఖరు గుర్రంగూడా అయిదారు నెలల క్రిందట తనువు చాలించింది. ఇక్కడికొస్తూ చూస్తివిగదా, నా మనమడు సైకిల్ సవార్ నేరుస్తున్నాడు. రాయగలిగిన వాళ్లున్నంతకాలం పద్యం ఉంటుంది. లేకపోతే దాని స్థానంలో మరొకటి వస్తుంది. మొత్తంమీద జీవితయాత్రలో సేదదీర్చే చలువ పందిరి గదంటయ్యా కవిత్వమంటే? అది ఉండాల.

ఏదో ఒక రూపంలో ఉండి తీరాల! ఏదీ, 'కదిలేది కదిలించేదీ, పెనునిద్దర వదిలించేదీ, మునుముందుకు నడిపించేదీ...' అని వల్లిస్తూ ఉంటావే, ఆ కవిత ఒకసారి పూర్తిగా చెప్పు" అన్నారు నాయనివారు!

❖ ఆంధ్రప్రభ వారపత్రిక - 24 జులై, 1996. ❖